# శ్రీహరితో ముఖాముఖీ!

శ్రీహరి అంటే సినిమా హీరో అనుకునేరు. కాదు... సర్వాంతర్యామి!... తిరుమల కొండపై గల లక్ష్మీసమేత శ్రీనివాసుడు! అతడే శ్రీహరి! జగద్రక్షకుడు. దేవాధిదేవుడు.

ఓ పరమభక్తాగ్రేసరునికి కొంతకాలంగా కలలో దర్శనమిస్తూ... కోరిన కోరికలు ఈడేర్చకుండా ఏడిపిస్తున్నందుకు, మనసులో వేదనకి, అక్షరరూపమే ఇది!

రాజకీయ నాయకుల్లాగ... రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లాగ... బడాబడా కాంట్రాక్టర్లలాగ... అవినీతి అధికారుల్లాగ... నీకూ ధనదాహం తీరదా వేంకటేశ్వరా?

అదేమంటే పెళ్ళికోసం కుబేరునివద్ద అప్పు చేసానంటావ్...! అదింకా తీరలేదంటావ్! అదెప్పుడు తీరునో తెలీదంటావ్! అంతవరకు మాగుండు గొరుగుతూనే వుంటావ్!-

మా గోడు కాస్తంత విన్పించుకో స్వామీ!

ఎన్ని సంవత్సరాలు ఏ పార్టీ పదవిలో వున్నా... బీదాబిక్కికి వొరిగిందేమీ లేదు! ఏళ్ల తరబడి నువ్వు కొండమీద కులుకుతున్నా... స్వాములు పెట్టే నైవేద్యం ఆరగిస్తున్నా... భక్తకోటికి నీ దర్శనం దొరకటం దుర్లభమౌతోంది. నీ దర్శనానికొచ్చి ఇక్కట్ల పాలుకాలేక నానాయాతన అనుభవిస్తున్నారు.

ఎన్నికలు అయిదేళ్ళకోమారు వచ్చి ప్రజలను పలుకరించిపోతూ వుంటయ్. అదే పండుగనుకుని నిష్ఠ దరిద్రులు ఓ వంద పుచ్చుకుని... మందు పుచ్చుకుని ఎవడికి పడితే వాడికి ఓటేసి పారేస్తారు.

గెలిచినవాడు నాయకుడై వోట్లేసినవారికి గాని... దేశానికి గాని ఏదో వొరగబెడతాడనే ఆశతోకాదు. ఎవరు పదవిలో వున్నా... ప్రజల సొమ్ము దండుకోవటం ఎట్లాగాని ఆలోచనే తప్ప... ప్రజాక్షేమం పట్టదు.

నువ్వూ వారిలో కల్సిపోయావా స్వామీ!

అవినీతి బురదలో... స్కాముల్లో... చిత్ర విచిత్రమైన కేసుల్లో ఇరుక్కున్నవారిని... పదవిలోనున్న నాయకులు కాపాడతారు. ఏ చట్టాలు వారిని ఏమీ చేయలేవు. అదీ మా ఘనత!

నువ్వూ మాలో ఒకడివైపోతావా వేంకటేశ్వరా!? ఈ సొసైటీలో ఎన్నిరకాల నేరస్తులు స్వైరవిహారం చేస్తున్నారో నీకు తెలీదా?- తెలిసీ వారిని కాపాడి రక్షిస్తున్నావా?- నిన్ను శరణు కోరారని... నీ హుండీలో నోట్లకట్టలు వేస్తారనీ కాపాడుతున్నావా?- మరేం ఫర్వాలేదని అభయ హస్తమిస్తున్నావా?

నీవు కరుణామూర్తివి! దయాసాగరుడివి? దీనజన బాంధవుడవు... అబ్బో నీకెన్నిరకాల పేర్లో! నీవూ కలవారికే గొడుగుపడతావ్. వారిని రక్షిస్తావ్! ఆదుకుంటావ్! నీ అక్కున చేర్చుకుంటావ్. కోట్లాది ధనం వారికి స్వంతం చేస్తావ్.

అవున్లే! నువ్వూ కేపిటలిస్టువే! డబ్బున్న వారి సేవలు... అండదండలే నీకు ఎంతో అవసరం! అలాంటి వారుంటేనే కదా నీ హుండీలో లక్షలకొద్దీ నోట్లకట్టలు... బంగారు ఇటుకలు... బిస్కెట్లూ పడేవి?! బీదవారు నీ హుండీకి సమర్పించే కానుకలు నీకేపాటి?

బడాబాబులు నీకు బంగారు కిరీటాలు... నవరత్న ఖచిత ఆభరణాలు చేయిస్తారు. నీ దయకి పాత్రులౌతారు. బ్రహ్మోత్సవాలప్పుడు నిన్ను మోస్తారు. నీ రథం మోకు పట్టి కొద్దిదూరమైనా లాగుతారు.

నీకు విరాళాల రూపంలో వచ్చే ఆదాయమంతా బ్లాక్ మనీయేగా స్వామీ!... నీకు దానమిచ్చినా... కానుకగా సమర్పించినా... నీ కరుణ వారిపైనే కదా!

పేదవాడు నీకేమిచ్చుకోగలడు? కష్టార్జితంలో ఏం మిగుల్తుంది గనుక? కాళ్ళునొప్పి పుట్టినా నీ కొండకి నడిచే వస్తాడు. క్యూ కాంప్లెక్స్‌లో రోజుల తరబడి నిలబడి ఓర్పు సహనాన్ని పెంచుకోగలడు! మహా అయితే తలనీలాలు సమర్పించుకోగలడు!... అంతేనని గదా వారి పట్ల చులకనభావం? లేదూ ఓ పదిరూపాయలు నీ హుండీలో వేసి కాచి కాపాడుమంటాడు. అందుకనే కదా నీ నిర్లక్ష్యం!

నీ దర్శనభాగ్యం పేదలకు లిప్తపాటా? గొప్పోరికి శ్రీమంతులకు, అధికారులకు, నాయకులకు, రికమెండేషన్ గలవారికి చాలాసేపా? వారికి 'క్యూ'లో రావలసిన అవసరం లేదా?

ఇదేం న్యాయం స్వామీ! ఇదెక్కడి ధర్మం దేవదేవా?

మా ప్రభుత్వ పోకడలాగానే వుంది నీ కరుణ కూడా! దున్నేవాడిది భూమి అను నానుడిలాగ కలవారికే నీ దర్శనభాగ్యం. (అదీ క్షణాల్లో!)

ప్రజాప్రయోజనాల పేరుతో నీ డబ్బు... నీ ఆదాయం ఎంత వృధా చేస్తున్నారో... కబళిస్తున్నారో గమనిస్తున్నావా వేంకటేశ్వరా?- నీ కళ్ళకు తిరునామం అడ్డంగా వుంటోందా?... లేక నిలబడే నిద్రపోతున్నావా?... మరైతే... మెక్కుతున్నవారిని శిక్షించవేం?.. క్షమించి వదిలేస్తున్నావేం?- అందరినీ సమదృష్టితో చూడలేవా?... ఓరి దేవుడో... నీకిదేం పక్షపాతబుద్ధి?

మానవులు పచ్చి అవకాశవాదులు. ఏ ఎండకా గొడుగు పట్టగల మేధావులు. నీవూ వారిలో చేరి పోయావా? ఇది అన్యాయం కదూ? అధర్మం కాదూ?- నీకు డబ్బున్న భక్తులు గొడుగులు పడుతున్నార్లే వూరేగింపు సమయాల్లో...! అది చాలా? పేదలు అక్కర్లేదా?

రాక్షసులకంటే ఈ మనుషులు యమడేంజర్!- అలనాడు నీవు గద, చక్రం... బాణాలతో రాక్షస సంహారం కావించావ్. కానీ... ఇప్పుడు... ఇంతమంది రాక్షసులను వధించటం నీవల్లకాదు. చట్టం ఒప్పుకోదు. అదే నీ భయం!

మావద్ద క్షిపణులున్నయ్... అణుబాంబులున్నయ్... గ్రహాంతర యానం చేస్తున్నాం. మమ్మల్ని చూచి గర్వపడుతున్నావా?... మా తెలివిని మెచ్చుకుని శ్లాఘిస్తున్నావా?... లేక మా వినాశనాన్ని మేమే కోరుకుంటున్నాం కదాని సంబరపడుతున్నావా?- జగన్నాటక సూత్రధారివి కదా?!... నీకు అన్నీ తెలుసు!

అవునూ... నీకూ పబ్లిసిటీ పట్ల వ్యామోహం వుంది కదూ? అందుకే 'సప్తగిరి' ఆధ్యాత్మిక మాసపత్రిక నడిపించుకుంటున్నావ్. ఇది చాలకపోతే చెప్పు... నీ పబ్లిసిటీ కొరకు దినపత్రిక నడపమంటావా?... ఎన్ని? ఒక్కటి చాలా? లేక ఏడుకొండల పేరుతో ఏడు రకాల దినపత్రికలను ప్రారంభించమనెదవా? సీక్రెట్‌గా చెప్పు. ఫర్వాలేదు. కాకుంటే నీకోసం ప్రత్యేకించి ఓ టి.వి.ఛానల్ కావలసి వచ్చెనా నీకు? ఇప్పుడు నీ ప్రచారానికి లోటేం జరుగుతున్నదని నీకు అలాంటి కోరికలు?- ఆహఁ!... అర్థమైంది!... ఆ వంకతో మరికొందరు బాగుపడతారు. నాలుగురాళ్ళు వెనకేసుకోగలరు.

నీవెలా కొట్టమంటే అలా డప్పు కొడతాం! నీవూ రాజకీయ చతురుడివే! మాయోపాయాలు నీ స్వంతం! ఎప్పుడు ఏది కావాలో నీ భక్తుల చెవుల్లో వూదుతావ్! అన్నీ జరిపించుకోగల సమర్థుడివి! మహామహిమాన్వితుడివి కదా నీవు?!-

ఆమాత్రం స్వార్థం నీకు వుండవలసిందే! లేకపోతే వెనుకబడి పోతావ్! రేస్‌లో ఎప్పుడూ ముందు వుండాలి కదా?!-

వెనుకబడటం అంటే గుర్తుకొచ్చింది...అసలు నీదే కులం?... రాముడు అవతారమెత్తి రాజునన్నావ్. గోవిందుడి అవతారమెత్తి యాదవుడినన్నావ్... ఇలా కులాలు మార్చడం తప్పుకదూ?

విద్యాసంస్థల్లో... వుద్యోగాల్లో మాకు కులధృవీకరణపత్రం అవసరం! ఇక్కడ రూల్ ఆఫ్ రిజర్వేషన్ వుంది.

కులాలపేరుతో పార్టీ టిక్కెట్టిచ్చి రాజకీయం నడుపుతున్నాం! పార్టీ జండాలెగరేస్తున్నాం!

మరి... భూలోకంలో శ్రీవేంకటేశ్వరునిగా కొలవబడుతున్న నీకు 'కులం' అక్కర్లేదా! అక్కరకురాదా?

నిన్ను ఏ కులం జాబితాలో చేర్చాలి? ఒకవేళ నీకు ఎన్నికలలో పోటీ చేయాలనే కోరికే కలిగితే... అప్పుడు 'కేస్ట్' సర్టిఫికెట్ కోసం ఎం.ఆర్వో దగ్గరకు లగెత్తుకెళ్ళాలి! లేకుంటే నామినేషన్ 'కాన్సిల'వుతుంది. పోటీకి నీవు అనర్హుడవంటారు.

అంతే కాదయ్యోవ్...! నీ స్థిరచరాస్తులు... నీ ఆదాయ వివరాలు అన్నీ వివరంగ నామినేషన్ పత్రంలో వివరించాలి! ఎన్నికైన తర్వాత నీవు కోటీశ్వరుడివో... మిలియనీర్‌వో అని తెల్సి నీ గుట్టు బైటపడటమో... అప్పొజిషన్ వర్గం వారు బైటపెట్టటమో జరిగిందనుకో... నీ శాసన సభ్యత్వమో... పార్లమెంట్ సభ్యత్వమో ప్రాబ్లమ్స్‌లో పడుతుంది. నీకు జైలుశిక్ష వేస్తారు.

అవునయ్యోవ్! నువ్వు మా నాయకుల మాట నమ్మి పోనపోకు! నిన్ను ఆకాశానికెత్తేస్తారు.

నిన్ను ముఖ్యమంత్రినో... ప్రధానినో... గవర్నర్‌నో... రాష్ట్రపతినో చేస్తాం... తమ పార్టీలో చేరమంటారు. తమకు జై కొట్టమంటారు. అవసరం తీరేక నీకు 'నామాలు' పెడతారు. అవును. నిజమే! నీవెట్లాగూ 'నామాల' స్వామివే కదా?.... నీకేం భయం?

అయినా అష్ట్రాల్ అయిదేళ్ళ పదవీకాలం మీద దేవుడివైన నీకు వ్యామోహం దేనికి?- ఏకచ్ఛత్రాధిపత్యం వహిస్తూ హాయిగా పాలకడలిలో శేషపాన్పుపై పవ్వళించి కడుపులో చల్ల కదలకుండా కళ్ళు మూసుకుని కలలు కనక?

నువ్వు మాతో వేగలేవు సుమా?!

నీకు తెలుసో లేదో... నీపేర ఎన్నో తెలుగు సినిమాలు... నాటకాలు... టి.వి.లో ఎపిసోడ్స్... ధారావాహికలు వచ్చాయ్. నీవెలా వుంటావో... నీ రూపాన్ని మేము ఎరుగము కాని... నీవేషం ధరించిన వారు మాత్రం డబ్బుతోపాటు కీర్తి ప్రతిష్ఠలు గడించారు. అవతార పురుషులుగా వెలిగేరు.

అవునూ... నీకసలు టి.వి. ఛానల్‌తో ఏం పని?- నీ స్థాయికీ... స్థోమతకు ఒక రామోజీ ఫిలింసిటీని తలదన్నే స్టూడియోనే తిరుపతిలో కట్టుకోవచ్చు! ఆ కోరిక వుంటే సెలవీయ్!- ఏడాది తిరిగేలోగా దిమ్మతిరిగిపోయేటంతటి ఫిలిమ్ స్టూడియో నిర్మిస్తాం! నీ స్టూడియో ఆదాయం పెరగటానికి... ఇకపై ఏ పౌరాణిక సినిమా తీయాలన్నా... టి.వి. సీరియల్స్ (పౌరాణికం) తీయాలన్నా తిరుపతి స్టూడియోలోనే తప్పక షూట్ చేయాలనే గవర్నమెంట్ జీ.వో. ఇస్తాం! ఏమంటావ్!

ఆఁ!... అసలు విషయం మరిచాను స్వామీ- నీవు ఇన్‌కమ్‌టాక్స్ పేయర్‌వేనా? నీకు 'పాన్‌కార్డ్' వుందా? నీ టాక్స్ కన్సల్టెంట్ అనుభవజ్ఞుడేనా?

ఎందుకనంటే... నీ ఆదాయ వివరాలు దాచిపెట్టి ఏటా రిటరన్ ఫైల్ చేయకుంటే... నిన్ను 'క్రిమినల్' కింద జమకడతారు స్వామీ!

గతం గతః!- ఇకనైనా కళ్ళు తెరు. నీ అసెట్స్ డిక్లేర్ చేస్తూ ఆదాయం పన్ను కట్టి రిటరన్ ఫైల్ చెయ్. లేకపోతే ప్రమాదం! అర్థమైందా?-

డబ్బున్న వారిదే రాజ్యం! నీకు ఆదాయం లేదన్నా... నీవు పేదవాడిని చెప్పినా నీ ముఖం ఎవ్వరూ చూడరు. నీకెవరూ ఏవిధంగానూ సాయపడరు. డబ్బు లేనివాడు దుబ్బుకి కొరగాడు.

ఆదాయం కొరవడి... దివాలా ఎత్తిన ఆలయాలు... అందులోని దేవుళ్ళ మొర ఎవరు ఆలకిస్తున్నారు?- అక్కడ అర్చకులు లేరు. వున్నా దీపధూపనైవేద్యాలకు కరువే!

నీకు ఆదాయం వుంది కాబట్టి... నువ్వు కాస్త మాకంటికి పచ్చగా కన్పిస్తున్నావ్ కాబట్టి... అప్పుడప్పుడు మా కోర్కెలు తీరుస్తున్నావ్ కాబట్టే నీకు అంత గౌరవం!- లేదనుకో... ఒక్కడివే గుడిలో ఈగలు తోలుకుంటూ వుండవలసొచ్చేది కదూ?!

మా పుట్టపర్తి స్వామిని చూడు. ఆయనా మీకు మల్లే కోట్లకి అధిపతే! అందుకే ఆయన చుట్టూ నాయకులు చందాకోసం చేతులు కట్టుకు నిలబడతారు. ఆయన కోట్లు ఇవ్వనంటే... పుట్టపర్తి వేపు కన్నెత్తైనా చూడరు. అదీ విషయం!-

నీకున్నన్ని సేవలు ఈ ప్రపంచంలో ఏ దేవుడికీ లేవు. ఉచిత సేవలు... అర్జిత సేవలు.. నీకు గల ఆభరణాలు... ఆదాయం... పూజలు... పునస్కారాలు... పరిపాలనా వ్యవస్థ!... అధికారగణం... సేవకులు... పాలకవర్గం... ఇదంతా నీకు గల ఆదాయం... నీ సంపద చూసే స్వామీ! పుష్కరాల పేరుతో ఏటా పుష్కలంగ ఆర్జిస్తావ్! యువార్ గ్రేట్!!

అయినా మా రాజకీయాలు నీకు అర్థంకావులే! మా వ్యవహారమంతా అందితే జుట్టు లేకుంటే కాళ్ళ సామెత! అసలు మనుషుల తీరే అంత! అంతా స్వార్థమే! ఇది మా దౌర్భాగ్యం.

నీకు మతిమరుపు లేదు కదా?... మరి నీకు ఇవ్వన్నీ తెలియవా?- నీకు మాకు మల్లే టెన్షన్లు లేవు. నీలోకంలో ఆందోళనలు... బంద్‌లు... పోట్లాటలు... హత్యలు వుండవ్! ఉన్నట్టయితే అప్పుడు నీకు తెలిసి వచ్చేది. నీకు తలపట్టిపోయేది. పిచ్చెక్కేది.

నీకులాగే... మేమూ కొన్ని చేస్తాం. కొన్ని మరుస్తాం. అన్నిటికీ తలలూపుతాం. అసలు మానవ స్వభావమే అంతేలే స్వామీ! అన్నట్టు మరచాను. నీకు మూడో ఘాట్‌రోడ్ శాంక్షనైంది. తెల్సా?

ఓట్లు వేయించుకుని గద్దెనెక్కాక మాకు ప్రజలెందుకు?- మా చేతిలో పవరుంటే చాలు! ఒక ఊపు ఊపుతాం! మళ్ళీ ఎన్నికలొచ్చేదాకా మేమే మహారాజులం!!- దేవుడినైనా సరే మర్చిపోతాం! కష్టాల్లోకి నెట్టేస్తాం...

కష్టాల్లోనేనయ్యా నీవు మాకు గుర్తొచ్చేది?!- సర్వవేళ సర్వావస్థల్యందు నువ్వు మాతోనే వున్నావనుకో... నీ గ్లామర్ పోతుంది. మాకు మొహంమొత్తుతుంది. నీ భుజాలమీదే చేతులేయటానికైనా వెనుకాడం! నువ్వు ఒక సామాన్యుడివనుకుని... మాలో ఒకడివని భ్రమించి 'ఒరే-తురే' అని సంబోధిస్తాం! అదీ మా కల్చర్!- మదుసులు... బహు దేవాంతకులు!!

అందుకే... ఓ వేంకటేశ్వరా నీ కొండపై నీవే వుండు! మాలోకి రావద్దు! అక్కడుంటేనే మాకు ముద్దు!!

కథ ఇక్కడితో ముగిస్తాను. మిగతాది నెక్స్ట్ ఎపిసోడ్‌లో! కాస్త... కథకులను, విలేఖర్లను... ప్రెస్ అండ్ మీడియా వారిని గుర్తుంచుకో లేకపోతే బద్నామైపోతావ్. సెలవా మరి...!

- సమాప్తం -